క్లుప్తంగా

జీవిత బీమాతో కుటుంబానికి ధీమా



ఆత్మకూర్: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న ఎల్ఐసీ జీవిత బీమా సంస్థను ప్రతి ఒక్కరూ ఆదరించాలని చీఫ్ మేనేజర్ సురేష్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక ఎల్ఐసీ కార్యాలయంలో బీమా ఏజెంట్లతో సమావేశమై.. ఈ నెల 20న ఎల్ఐసీ 70 వసంతాల సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. 14 లక్షల మంది ఏజెంట్లతో రూ.40 కోట్ల బీమా పాలసీలు, లక్ష మంది ఉద్యోగులున్న ఏకైక సంస్థ ఎల్ఐసీ అని ప్రైవేటు సంస్థలను నమ్మి మోసపోకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రాజేశ్వర్, కరుణాకర్, సుబ్రమణ్యం, విరేశలింగం, రఘు, శివకుమార్, గోపాల్‌శెట్టి, రఘునాథ్, శ్రీనివాస్, చంద్రశేఖర్, ఖాజామైనోద్దీన్, శివరాజు, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్వోసీ అందజేత



మదనాపురం: మండలంలోని అజ్జకొల్లు గ్రామానికి చెందిన భారతయ్యకు గుండె సంబంధిత ఆపరేషన్ కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చేరారు. బాధితుడికి సీఎం సహాయ నిధి ద్వారా రూ.4 లక్షల ఎల్ఓసీ మంజూరు కావడంతో గురువారం వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి ఎల్ఓసీ కాపీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చిన ఆదుకుంటానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చెర్మన్ తిరుపతిరెడ్డి, నాయకులు సాయిబాబా, అక్కల మహదేవన్‌గౌడ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్ గ్రామానికి చెందిన గంధం వెంకటేష్, యాకూబ్ అనారోగ్యంతో మృతి చెందారు. బాధిత కుటుంబాలను గురువారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పుల్లారావు పరామర్శించారు. బాధిత కుటుంబాలకు మంత్రి జూపల్లి కృష్ణారావు, జూపల్లి అరుణ్ సహకారంతో ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున ఆర్థికసాయం అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రాజాగౌడ్, బాలకృష్ణ, దాసునాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలకు తరలిరండి



ఆత్మకూర్: మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రెండో రాష్ట్ర మహాసభలను ఈనెల 19న మహబూబాబాద్‌లో జరుగుతున్నాయని, కార్మికులు వేలాదిగా తరలిరావాలని టీయూసీఐ నాయకులు హనుమంతు, ప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పాత మున్సిపాలిటీ కార్యాలయంలో మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. నాయకులు సతీష్, శివన్న, మైనోద్దీన్, ఇస్మాయిల్, బాలరాజు, గోవర్ధన్, కార్మికులు పాల్గొన్నారు.

లక్ష్మీ హయగ్రీవస్వామి ఉత్సవాలు



ఎర్రవల్లి: బీచుపల్లి క్షేత్రంలోని కోదండరామ స్వామి ఆలయంలో లక్ష్మీ హయగ్రీవస్వామి ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో మొదటి రోజు అర్చకులు భగవదనుజ్ఞా, విష్వక్సేనారాధన, వాసుదేవ పుణ్యాహవచనం, రక్షాబంధనం, ఆచార్య రుత్విక్వరణం, మృత్సంగ్రహణం, యాగశాల ప్రవేశం, అంకురార్పరణ, అగ్నిప్రతిష్ఠ, అంకురార్పరణ గహవనం, తీర్థప్రసాద గోష్ఠి వంటి పూజా కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

ఆకలేస్తోంది..!



పాన్‌గల్ మండలంలోని కేతేపల్లి ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

- పదో తరగతి విద్యార్థులకు అందని అల్పాహారం
- ఖాళీ కడుపులతో ప్రత్యేక తరగతులకు..
- దాతలు సహకరించాలంటున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



చిన్నంబావి మండలం అయ్యవారిపల్లి ఉన్నత పాఠశాలలో బోధిస్తున్న ఉపాధ్యాయుడు (ఫైల్)

పాన్‌గల్: సర్కార్ బడుల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు వార్షిక పరీక్షల్లో మెరుగైన ఉత్తీర్ణత సాధించేందుకు ప్రభుత్వం గత నవంబర్ నుంచి సాయంత్రం వేళల్లో ఒక గంట ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. మరికొన్ని పాఠశాలల్లో ఉదయం పూట కూడా తరగతులు నడుస్తున్నాయి. దీంతో విద్యార్థులు ఖాళీ కడుపులతో తరగతులకు హాజరుకావాల్సి వస్తోంది. చదువుపై సరిగ్గా శ్రద్ధ చూపలేకపోతున్నామని పలువురు విద్యార్థులు వాపోతున్నారు.

మధ్యాహ్న భోజనమే ఆధారం..

మండలంలోని 12 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 394 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. మండలంలోని చింతకుంట ఉన్నత పాఠశాలలో దాత ముందుకు రావడంతో ఈ ఒక్క పాఠశాలల్లో అల్పాహారం అందుతుంది. ఉన్నత పాఠశాలలకు మారుమూల గ్రామాల నుంచి సైతం విద్యార్థులు ఉదయమే వస్తుండడంతో ఆ సమయానికి ఇంట్లో వంట కాకపోవడంతో విద్యార్థులు ఖాళీ కడుపుతోనే తరగతులకు హాజరవుతున్నారు. దీంతో వారు కేవలం మధ్యాహ్న భోజనంపైనే ఆధారపడాల్సి వస్తోంది. సాయంత్రం వేళల్లో జరిగే ప్రత్యేక తరగతుల్లో చదువులపై పిల్లలు ఆసక్తి చూపలేకపోతున్నారు.

మండలాల వారీగా..

మండలం	పాఠశాలలు	విద్యార్థులు
చిన్నంబావి	10	195
పాన్‌గల్	12	394
వీపనగండ్ల	08	143

అధికారులు, దాతలు సహకరిస్తేనే..

గతేడాది ప్రారంభంలో పలుచోట్ల దాతల సహకారంతో పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించారు. అనంతరం ప్రభుత్వం స్పందించి అల్పాహారం కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. ప్రస్తుతం ప్రత్యేక తరగతులు ప్రారంభమై 20 రోజులు గడుస్తున్నా ఎవరూ దృష్టి పెట్టడం లేదు. వార్షిక పరీక్షలు మార్చి రెండో వారంలో మొదలుకానున్నాయి. తరగతులు అప్పటి వరకు కొనసాగనున్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వం దృష్టి పెట్టడంతో పాటు అధికారులు, దాతలు ముందుకు రావాల్సిన అవసరం ఉంది.

దృష్టి సారించలేకపోతున్నాం



పదో తరగతిలో మంచి మార్కులు సాధించాలన్నది నా లక్ష్యం. పొద్దున్నే ఇంట్లో ఏమీ వండి పెట్టరు. దీంతో ఖాళీ కడుపుతోనే పాఠశాలకు హాజరవుతున్నాం. ఆకలితో పాఠ్యాంశాలపై దృష్టి సారించడం కష్టమవుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రభుత్వం లేదా దాతలు సహకరించి అల్పాహారం అందిస్తే మాకెంతో మేలు జరుగుతుంది.

– పల్లవి, పదవ తరగతి, పాన్‌గల్

బాగా ఆకలి అవుతోంది



నిత్యం 6 కిలో మీటర్ల దూరం చిన్నంబావి నుంచి పాఠశాలకు వస్తున్నా. ఇక్కడ బోధన చాలా బాగుంది. ఉదయమే ఇంటి నుంచి పాఠశాలకు వస్తాను. తిరిగి ఇంటికి వేళ్లేసరికి రాత్రి అవుతుంది. దీంతో బాగా ఆకలి వేస్తుంది. దాతలు ముందుకు వచ్చి పరీక్షలయ్యే వరకు అల్పాహారం అందిస్తే బాగుంటుంది.

– కార్తీక్, అయ్యవారిపల్లి ఉన్నత పాఠశాల, చిన్నంబావి మండలం

దాతలు ముందుకు రావాలి



గతంలో ప్రత్యేక తరగతుల సమయంలో దాతల సాయంతో పది విద్యార్థులకు అల్పాహారం అందించేవాళ్లం. ఈ సారి దాతలు ఎవరూ ముందుకు రాకపోవడంతో విద్యార్థులు ఆకలితో ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవం. మండలంలో చింతకుంట ఉన్నత పాఠశాలలో దాత ముందుకు రావడంతో విద్యార్థులకు అల్పాహారం అందుతుంది. పిల్లల శ్రేయస్సు కోసం దాతలు ముందుకు రావాలి.

– శ్రీనివాసులు, ఎంఈఓ, పాన్‌గల్

రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

మదనాపురం: కాంగ్రెస్ పార్టీ ఏర్పడి ఏడాది పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా నిర్లక్ష్యం వహిస్తోందని బీజేపీ నాయకులు ధ్వజమెత్తారు. హామీ మేరకు వెంటనే రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించాలని కోరుతూ గురువారం తహసీల్దార్ అబ్రహం లింకన్‌కు బీజేపీ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మట్లాడుతూ పూర్తిస్థాయిలో రైతులకు రుణమాఫీ చేయాలని, సన్నాలకు ప్రకటించిన బోనస్ ప్రతి ఒక్క రైతు ఖాతాలో జమ చేయాలని కోరారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే రైతులతో కలిసి భారతీయ జనతా పార్టీ తరఫున మండల కేంద్రంలో పెద్ద ఎత్తున ధర్నా చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు బాబుగౌడ్, మండల మాజీ అధ్యక్షుడు కృష్ణయాదవ్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు బీమా కిషోర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నాస్తిక సమాజం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

అమరచింత: నాస్తిక సమాజం నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం పట్టణంలోని హైస్కూల్ ఆవరణంలో విడుదల చేశారు. ఈసందర్భంగా నాస్తిక సమాజం జిల్లా అధ్యక్షుడు యాకుబ్, ప్రదాన కార్యదర్శి భాస్కర్ వామపక్ష పార్టీల నాయకులతో కలిసి క్యాలెండర్లను పంపిణీ చేశారు. ఈమేరకు వారు మాట్లాడుతూ దైవం, దయ్యం అనే భ్రమలు కల్పించి ప్రజలను ప్రశ్నించే తత్వానికి దూరం చేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాధికారమే పరమావధిగా పాలకులు ప్రజల అసమానతలను అవకాశంగా మార్చుకుని రాజ్యాన్ని తమ చెప్పుచేతుల్లో పెట్టుకుంటున్నారని ధ్వజమెత్తారు. ప్రజల్లో మూఢ నమ్మకాలను తొలగించడానికే నాస్తిక సమాజం కృషి చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, మాస్ లైన్ మండల కార్యదర్శి రాజన్న, సీపీఎం నాయకులు రాజు, రమేష్, బుచ్చన్న, భక్తరాజు, శ్యాంసుందర్, రఘు తదితరులు పాల్గొన్నారు.

'రైతు భరోసా' సర్వే ప్రారంభం



ఖిల్లాఘనపురం మండలం హన్‌పహడ్ శివారులో సర్వే చేపడుతున్న అధికారులు

ఖిల్లాఘనపురం: మండలంలో గురువారం రైతు భరోసా సర్వే ప్రారంభమైనట్లు తహసీల్దార్ సుగుణ, మండల వ్యవసాయ అధికారి మల్లయ్య తెలిపారు. మండలంలో 7 క్లస్టర్ల పరిధిలోని ఆగారం, అల్లమాయపల్లి, హన్‌పమడ్, సల్కెలాపురం, పర్వతాపురం, సోళీపురం గ్రామంలో సర్వే చేపడుతున్నామన్నారు. త్వరలోనే అన్ని గ్రామాల్లో సర్వే ప్రారంభిస్తామని తెలిపారు. నాలా రిజిస్ట్రేషన్ ఉన్న భూములు, ప్రభుత్వ స్థలాలు, సాగుకు పనికిరాని భూములు గుర్తించడం, ప్రభుత్వ కాల్వలకు, డ్యాములకు సేకరించిన భూములను గుర్తిస్తామని వెల్లడించారు. ఈ భూములకు రైతుభరోసా రాదన్నారు. సర్వేలో గుర్తించిన భూముల వివరాలను గ్రామ సభలు నిర్వహించి గ్రామస్తులందరి ఆమోదంతో వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్వేయర్, ఏఈఓ పాండు తదితరులు పాల్గొన్నారు.

నరసింహశర్మకు తెలుగు కీర్తి పురస్కారం



వనపర్తి టౌన్: పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాఖ్యత, సాహితివేత్త నాయకంటి నర్సింహశర్మకు అరుదైన గౌరవం దక్కింది. మూడు దశాబ్దాలుగా సాహిత్యరంగానికి చేస్తున్న సేవలను గుర్తించి కళావేదిక జాతీయ సంస్థ నాయకంటి నర్సింహశర్మను తెలుగు కీర్తి పురస్కారానికి ఎంపిక చేస్తూ గురువారం వర్తమానం పంపారు. ఈ మేరకు ఈనెల 21న విజయవాడలో జరిగే కళావేదిక జాతీయ సదస్సులో ఆయనకు తెలుగు కీర్తి పురస్కారాన్ని బహుకరించనున్నారు. తెలుగు భాష పరిరక్షణతో పాటు సాహిత్య రంగానికి సేవలందిస్తూ పాలమూరు జిల్లాలోని పలు సంస్థానాలపై అధ్యయనం చేసిన పరిశోధకుడిగా నాయకంటికి గుర్తింపు ఉంది. గతంలో అభ్యుదయ, సాహిత్య, రచయిత సంఘం నుంచి ఎన్నో పురస్కారాలు అందుకున్న నాయకంటి నర్సింహశర్మ తాజాగా తెలుగు కీర్తి పురస్కారానికి ఎంపిక కావడంపై వనపర్తి సాహితి కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్, సమన్వయకర్త బైరోజు చంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకంటి నర్సింహశర్మ మాట్లాడుతూ తెలుగు కీర్తి పురస్కారానికి ఎంపిక కావడంతో సాహిత్య రంగానికి చేసే సేవలపై రెట్టింపు బాధ్యత పెరిగిందన్నారు.

మంత్రి జూపల్లికి వినతి

కోడేరు: మండల కేంద్రంలో అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి జూపల్లి కృష్ణారావుకు గురువారం పంచాయతీ కార్మికులు ఐదు నెలలుగా వేతనాలు చెల్లించలేదని వెంటనే జీతాలు మంజూరు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో సాయిబాబు, మహేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ శాఖ ఏఈ కొండయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఖిల్లాఘనపురం గ్రామంలో సాధారణ స్తంభాల ద్వారా ఉన్న విద్యుత్ లైన్‌ను నూతనంగా ఏర్పాటు చేసుకున్న టవర్ స్తంభాల పైకి మార్చడం జరుగుతుందన్నారు. రైతులు, దుకాణ యజమానులు, వినియోగదారులు, రైస్‌మిల్లుల వారు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

కొత్తకోటలో ఆపరేషన్ ముస్కాన్

కొత్తకోట: పట్టణ శివారులోని మదనాపురం రోడ్డులో ఓ ఇంటి నిర్మాణంలో మహ్మద్ అనే వ్యక్తి 12ఏళ్ల వయస్సు ఉన్న బాలుడిని తనకు సహాయకుడిగా పెట్టుకొని గురువారం పని చేయించుకుంటున్నాడు. గమనించిన ముస్కాన్ సిబ్బంది పిల్లలతో పనిచేయించుకోవడం చట్టరీత్యా నేరమంటూ బాలకార్మిక నిర్మూలన అధికారి ఎండీ రఫీ కొత్తకోట పోలీస్‌స్టేషన్‌లో మహ్మద్‌పై ఫిర్యాదు చేయగా ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆనంద్ తెలిపారు. ఆటపాటలతో హాయిగా ఆడుకోవాల్సిన చిన్నారులు బాల కార్మికులుగా మారుతున్నారు. పుస్తకాలు పట్టాల్సిన వయస్సులో పనిముట్లు పట్టుకుంటూ సంతోషాలకు దూరం అవుతున్నారు. పరిశ్రమలు, హోటళ్లు, ఇటుక బట్టీల్లో పనిచేస్తూ శ్రమ దోపిడికి గురవుతున్నారు. ఇలాంటి వారిని రక్షించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆపరేషన్ ముస్కాన్‌ను చేపట్టింది.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని వెల్టూర్ స్టేజీ సమీపంలో ఎన్‌హెచ్ 44పై రోడ్డు దాటుతున్న వ్యక్తిని కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలైన ఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. వెల్టూర్ శివారులో గల ఓ రైస్‌మిల్లులో పనిచేసేందుకు వచ్చిన చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన కొందరు కూలీల్లో వికాస్ అనే వ్యక్తి సొంత పనిమీద వెల్టూర్‌కు వెళ్లి తిరిగి రైస్‌మిల్లు వద్దకు నడుచుకుంటూ వెళ్తుండగా కర్నూల్ వైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి వికాస్‌ను ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు 108 సమాచారం అందించి బాధితుడిని మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అవగాహన కల్పించాలి

మానవపాడు: ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ భాస్కర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డులపై అవగాహన కల్పించాలన్నారు.

ప్రతి కాన్పు ఆస్పత్రిలోనే జరగాలి



మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్

పాన్‌గల్: ప్రతి కాన్పు పీహెచ్‌సీలోనే జరిగేలా వైద్య సిబ్బంది గ్రామాల్లో గర్భిణులకు అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ సిబ్బందికి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రతి గర్భిణి పేరును నమోదు చేయించి వారు క్రమం తప్పకుండా ఏఎన్‌సీ పరీక్షలు చేయించుకునేలా చూడాలని, ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను వివరించాలన్నారు. గర్భిణులు, బాలింతల కోసం ప్రభుత్వం కల్పించిన 102, అంబులెన్స్ వాహనాలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. సబ్‌సెంటర్ల వారిగా గర్భిణుల నమోదు, కాన్పుల సంఖ్యపై ఆయన ఆరా తీశారు. మాందాపూర్, కేతేపల్లి, రేమద్దుల గ్రామాల సబ్‌సెంటర్లల్లో కాన్పుల సంఖ్య తక్కువగా ఉందని, ఆయా కేంద్రాల ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పనితీరును మెరుగు పర్చుకోవాలన్నారు. నిర్దేశించిన టార్గెట్‌ను చేరుకొని సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో సీహెచ్ఓ రామయ్య, ఆయుష్మాన్ మందిర్ వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ మాదిరి పరీక్ష



మాదిరి పరీక్షలకు హాజరయిన విద్యార్థులు

ఆత్మకూర్: నవోదయ, గురుకులంలో నిరుపేద విద్యార్థులకు అవకాశం కల్పించేందుకు గురువారం నిర్వహించిన ఉచిత మాదిరి పరీక్ష విజయవంతమైందని లిటిల్‌ఫ్లవర్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు మీర్జాఅన్వర్‌బేగ్, మీర్జాఅక్తర్‌బేగ్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 18న ఆరో తరగతిలో ప్రవేశ పరీక్షలు జరుగుతాయని, విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు ఉచిత మాదిరి పరీక్షను నిర్వహించామన్నారు. దేవరకద్ర, మదనాపురం, అమరచింత, ఆత్మకూర్, కొత్తకోట, నర్వ, చిన్నచింతకుంట మండలాల నుంచి 50 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. ఈ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శేఖర్, రఘురాం, సౌజన్య, నందిని, ఆలియా, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులకే సంక్షేమ ఫలాలు



మాట్లాడుతున్న అధికారులు

పాన్‌గల్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలకు అందే విధంగా సర్వేలో అర్హులను పకడ్బందీగా గుర్తించాలని ఎంపీడీఓ గోవింద్‌రావు, తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో పంచాయతీ కార్యదర్శులు, ఏఈఓలు, ఉపాధి సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుక్రవారం నుంచి నిర్వహించే ఇంటింటి సర్వేలో రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు వంటి సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం వివరాలను సేకరించాలని ఆదేశించారు. వ్యవసాయానికి యోగ్యం కానీ భూములు, వ్యవసాయ కూలీల వివరాలను క్షుణ్ణంగా పరిశీలన చేసి వారి వివరాలు, సంక్షేమ పథకాలకు అర్హులైన వారి వివరాలను పక్కగా సేకరించాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో పేదలకు నష్టం జరగకుండా చూడాలన్నారు. వివరాల సేకరణ ఈనెల 20వ తేదీ వరకు పూర్తి చేయాలన్నారు. వివరాల సేకరణలో తప్పులు జరిగితే సిబ్బంది బాధ్యులు అవుతారని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీఓ రఘురాములు, ఏఓ రాజవర్ధన్‌రెడ్డి, ఏపీఓ కుర్మయ్య, డీటీ అశోక్‌నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ' జయప్రదం చేయండి: ఎన్‌పీఆర్‌డీ



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న దివ్యాంగులు

వనపర్తి రూరల్: కేంద్ర ప్రభుత్వం దివ్యాంగులకు అందించే కనీస పింఛన్ రూ.5వేలకు పెంచాలని, వారి హక్కులు సాధన, సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి 10న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గురువారం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) వనపర్తి జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షుడు డి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో వాల్‌పోస్టర్, కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పింఛన్ రూ.5 వేలు పెంచడంతో పాటు ప్రతి వికలాంగులకి అంత్యోదయ రేషన్ కార్డు, ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు ఇచ్చి 200 రోజుల పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇందిరాగాంధీ జాతీయ వికలాంగుల పింఛన్ పథకాన్ని వికలాంగుల అందరికి వర్తింప చేయాలని, కేంద్ర ప్రభుత్వం పింఛన్ పొందడం వికలాంగుల హక్కుగా ప్రతి ఏటా 15 శాతం పింఛన్ పెంచేందుకు, నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్ కల్పిస్తూ పార్లమెంట్‌లో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఇతర డిమాండ్ల సాధన కోసం ఫిబ్రవరి 10న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమానికి జిల్లాలోని వికలాంగులు భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ వనపర్తి జిల్లా అధ్యక్షుడు ప్రభుస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ, లక్ష్మి, భాగ్యమ్మ, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రార్థన మందిరాలకు యూనివర్సల్ తాళాల పంపిణీ



చెన్నారం, గొల్లపల్లి గ్రామస్తులకు తాళాలు అందిస్తున్న ఎస్ఐ



అమరచింతలో జమీయా మసీదు నిర్వాహకులకు తాళాలను అందిస్తున్న ఎస్ఐ సురేష్

అమరచింత: పట్టణంలోని జామీయా మసీదు నిర్వాహకులకు యూనివర్సల్ తాళాలను ఎస్ఐ సురేష్ గురువారం అందించారు. ఈమేరకు ఎస్ఐ మాట్లాడుతూ ఆలయాలు, చర్చిలు, మసీదుల్లో ఎక్కడో ఒక చోట చోరీలు జరుగుతున్నాయన్న వార్తలు వినిపిస్తున్నాయని, వీటిని అరికట్టేందుకు ప్రత్యేకంగా తయారు చేసిన తాళాలను పోలీసు శాఖ ద్వారా పంపిణీ చేస్తున్నామన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లోని మసీదులు, ఆలయాలు, చర్చిల నిర్వాహకులను పిలిపించి అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో జామీయా మసీదు అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్, ఖాజాహుస్సేన్, తౌఫిక్, పాషా పాల్గొన్నారు.

గోపాల్‌పేట: ప్రజలు చోరీలు జరగకుండా తాళాలు వేసుకోవాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం ఎక్కువ ఖర్చు లేకుండా రూ.500 ల్లోనే జాగ్రత్త పడొచ్చని రేవల్లి ఎస్ఐ రాము అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జిల్లాలోని ఆలయాల్లో జరిగిన చోరీలను దృష్టిలో ఉంచుకుని యూనివర్సల్, ఇన్‌విసిబుల్ లాక్‌లు సొంత ఖర్చుతో తెప్పించామని తెలిపారు. ఈ లాక్‌లు బయటి నుంచి కనిపించవని, లోపల మాత్రమే ఉంటాయని బయటి నుంచి గుర్తించేందుకు అవకాశం లేదన్నారు. గురువారం నాలుగు లాక్‌లు చెన్నారం, గొల్లపల్లి ఆలయాలకు అందించామని తెలిపారు. మండలంలోని ప్రజలు కూడా ఈ లాక్‌లు తీసుకోవచ్చని, పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు. ఈ లాక్‌లు వాడటం ద్వారా చోరీలు నియంత్రించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

రంగాపూర్‌లో క్రికెట్ పోటీలు



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న దాతలు

పెబ్బేరు రూరల్: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పెబ్బేరు మండలంలోని రంగాపూర్ గ్రామంలో వివేకానంద యూత్ ఆధ్వర్యంలో ప్రీమియర్‌లీగ్–11 క్రికెట్ పోటీలను నిర్వహించినట్లు సభ్యుడు కార్తీక్ రెడ్డితెలిపారు. ఈ టోర్నమెంట్ ఫైనల్‌లో ప్రథమ బహుమతి గెలుచుకున్న ఈగల్ వారియర్స్ టీంకు పెద్దింటి సంజీవ్ స్పాన్సర్‌గా రూ.20 వేల నగదు, అదేవిధంగా రన్నరప్‌గా నిలిచిన హనుమాన్ రైడర్స్ టీమ్‌కు స్పాన్సర్‌గా రూ.15 వేల నగదును బాపనపల్లి రమేష్, అన్ని జట్ల ఆటగాళ్లకు టీషర్టులను స్పాన్సర్‌గా సింగిల్‌విండో డైరెక్టర్ పెద్దింటి చంద్రయ్య అందించారు. కార్యక్రమంలో గట్టయ్య, బీజేపీ నాయకులు జంగా భగవంతు, దారపోగు వెంకటేష్, చింతకాయల రాజు, కావలి భాస్కర్‌నాయుడు, లక్ష్మణ్ నాయుడు, ఎల్లస్వామి, దేవర్ల నరేందర్, వివేకానంద యూత్ సభ్యులు పాల్గొన్నారు.